క్లుప్తంగా

మైపాడు బీచ్‌లో యువకుడి మృతి

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు బీచ్‌లో ఆదివారం ఓ యువకుడు ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఇమ్రాన్(23) ఐదుగురు స్నేహితులతో కలిసి మైపాడు బీచ్‌కు వచ్చారు. స్నేహితులందరూ కలిసి సంతోషంగా మునుగుతూ ఉండగా అలల తాకిడికి ఇమ్రాన్ నీటిలో మునిగిపోయాడు. వెంటనే గమనించిన తోటి స్నేహితులు ఇమ్రాన్‌ను కాపాడి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో తోటి స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులను అభినందిస్తున్న పీహెచ్‌పీ నాయకులు

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని పీహెచ్‌పీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, 25వ వార్డు కార్పొరేటర్ బద్దెపూడి గిరి అన్నారు. స్థానిక బుజబుజనెల్లూరులోని ప్రభుత్వ డీపీఎస్ఎం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టులో 90 మార్కులకు పైగా సాధించిన 35 మంది విద్యార్థులకు పీహెచ్‌పీ ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.1,116ల నగదుతో పాటు జ్ఞాపికను అందించారు. అలాగే ఇతర విద్యార్థులకు తెలుగు భాషోపాధ్యాయ సమితి ప్రధాన కార్యదర్శి బద్దిపూడి శ్రీనివాసులు జిప్ ఫైల్స్, తెలుగు ఉపాధ్యాయుడు అచ్యుతమణి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. పాఠశాలలో ఉత్తీర్ణత పెరగడానికి కారణమైన ఉపాధ్యాయులు అచ్యుతమణి, మంజుల, రవీంద్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు, పెద్దాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బ్రహ్మారెడ్డి, దూడల ప్రసాద్‌రావు, షబ్బీర్, ఉపాధ్యాయులు ప్రసాద్, సమీవుల్లా, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలియజేయండి

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు చేయవచ్చని తెలియజేశారు. అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని కృషి చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

పరిమళించిన మానవత్వం



ఆశ్రమంలో పెరిగిన యువతికి నిశ్చితార్థం జరిపిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని కొండాయపాళెం రోడ్డు వసంతోపు సెంటర్‌లో ఉన్న జనహిత-వాత్సల్య ఆశ్రమం మానవత్వం పరిమళించే కార్యక్రమానికి వేదికైంది. ఆశ్రమంలో పెరిగిన యువతికి ఓ ప్రభుత్వ ఉద్యోగితో నిశ్చితార్థ వేడుక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ జనహిత వాత్సల్య ఆశ్రమానికి చెందిన తల్లిదండ్రులు లేని యువతి చిద్రూప లక్ష్మి, విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న నాయుడుపేటకు చెందిన సుమన్‌తో నిశ్చితార్థం జరిగిందన్నారు. అనంతరం ఆదర్శ వివాహం చేసుకోనున్న వరుడిని అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు జీవీ సాంబశివరావు, విశ్రాంత ఉద్యోగులు పుల్లారెడ్డి, నిర్వాహకులు అరవ పరిమళ, బి.పరిమళ, ఆడిటర్ దుర్గాప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

నెల్లూరు (టౌన్) : బర్మాషెల్‌గుంటలోని అగ్నిప్రమాద బాధితులకు సహృదయ సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం వితరణ చేశారు. సేవా సమితి నిర్వాహకుడు కారుమంచి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఫణికుమార్ ఆధ్వర్యంలో బాధితులకు పది కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాము, శ్రీనివాసులు, వరప్రసాద్, సుబ్బారావు, రవికిరణ్, మల్లికార్జున్, హజరత్తయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న చిల్లర దొంగలు



వెంకటాచలంలోని ఓ దుకాణంలో రేకులను పగులుగొట్టిన దొంగలు (ఫైల్)



దుకాణంలో చిందర వందరగా పడేసిన వస్తువులు (ఫైల్)



రామదాసుకండ్రిగలో పట్టపగలే దొంగలు పగులగొట్టిన బీరువా (ఫైల్)

వెంకటాచలంలో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అందరూ గాఢ నిద్రలోకి జారుకున్న తరువాత దుకాణాలు, దేవాలయాలు, తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చిక్కిన కాడికి దోచుకుని పరారవుతున్నారు. పక్కా ప్లాన్‌తో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సైతం సవాల్ విసురుతున్నారు. దొంగల బెడదతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

- పక్కా ప్లాన్‌తో చోరీలు
- భయాందోళనలో వెంకటాచలం ప్రజలు

వెంకటాచలం : మండలంలో గత రెండేళ్లుగా చిల్లర దొంగలు పెట్రేగిపోతున్నారు. మొత్తం 25కుపైగా చోరీలు జరగ్గా, వీటిలో కొన్నింటిని మాత్రమే పోలీసులు రికవరీలు చేశారు. వాటిలో వెంకటాచలంలోని సెల్‌ఫోన్ దుకాణం, దేవస్థానంలో జరిగిన చోరీ తదితర కేసులు ఉన్నాయి.

అర్ధరాత్రి తరువాత..

ప్రజలు నిద్రలోకి జారుకున్న తరువాత దొంగలు పక్కా పథకంతో చోరీలకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారుజామున మూడు గంటల్లోపే చోరీలు చేస్తున్నారని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో తాళం వేసిన నివాసాలను లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి నివాసాల్లోకి ప్రవేశించి తెల్లవారేసరికి ఇంట్లోని విలువైన వస్తువులు ఒక్కటీ లేకుండా చేసేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణాల్లో తలుపులు, రేకులను పగులగొట్టి విలువైన వస్తువులను చోరీ చేస్తుండటంతో వ్యాపారస్తులు అప్పులు పాలైపోతున్నామని వాపోతున్నారు.

దేవాలయాల్లోనూ చోరీలు

మండలంలోని దేవాలయాలనూ చిల్లర దొంగలు వదలడం లేదు. నివాసాలు, దుకాణాల్లో చోరీ చేసేందుకు వీలుకాకపోవడంతో దూరంగా ఉండే దేవాలయాల్లోకి ప్రవేశించి హుండీలను పగులగొట్టి నగదు, ఇతర కానుకలను దోచుకోవడంతో పాటు స్వామి, అమ్మవార్ల మెడలో బంగారు, వెండి నగలను దోచుకెళ్తున్నారు. మండలంలోని చెముడుగుంట, చవటపాళెం గ్రామంలో గతంలో చోరీలు జరిగాయి. ఇటీవల కసుమూరు పంచాయతీ చింతలపాళెం, కాకుటూరు, కంటేపల్లి ఆలయాల తలుపులు పగులగొట్టి బంగారు నగలు, హుండీలను దోచుకెళ్లారు. గత నెలలో గొలగమూడి గ్రామంలోని శేఖర్‌నాయుడు నివాసంలో గుర్తుతెలియని దొంగలు భారీ దొంగతనానికి స్కెచ్ వేసి విఫలం చెందారు. బీరువా పగులగొట్టేందుకు వీలు కాకపోవడంతో ఓ బ్యాగులో ఉన్న రూ.25 వేల నగదుతో పరారయ్యారు. పక్కా ప్రణాళికలతోనే చోరీలకు పాల్పడుతుండటంతో గ్రామస్తుల సమాచారం లేనిదే ఈ చోరీలు జరిగే అవకాశం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో దొంగతనాలు పెరిగిపోవడంతో ప్రజలు బంగారు నగలను నివాసాల్లో దాచి ఉంచేందుకు భయపడిపోతున్నారు. తాళాలు వేసిన నివాసాల్లో పట్టపగలే చోరీలు జరుగుతున్నాయని, ఇంట్లో బంగారు ఉంచితే ఎలాగని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

> **చోరీల అదుపునకు చర్యలు**
>
> చోరీల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడుతాం. సిబ్బంది కొరత ఉండటంతో పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. చోరీలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – అంకమరావు, సీఐ

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

గ్రామాల్లో జరిగే దొంగతనాలను పోలీసులు పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలతో పాటుగా రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌లో విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో చోరీలపై దృష్టి సారించలేకపోతున్నారు. ఉన్న సిబ్బందితో విధులకు న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో మండలంలో చిల్లర దొంగల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. పోలీసులు చోరీలను అరికట్టేందుకు చర్యలు చేపట్టి ప్రజల్లో భయం పోగొట్టాల్సిన అవసరం ఉంది.

మడమనూరు విద్యార్థినికి ఐఐటీ ర్యాంక్



జాహ్నవిని అభినందిస్తున్న గ్రామస్తులు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన గురు జాహ్నవి అనే విద్యార్థిని జేఈఈ అడ్వాన్స్‌లో 1,763వ ర్యాంకు సాధించి ఐఐటీకి అర్హత పొందారు. దీంతో గ్రామస్తులు ఆదివారం జాహ్నవిని అభినందించారు. మడమనూరు బీసీ కాలనీకి చెందిన మాధన గోపి, శాంత దంపతుల పెద్ద కుమార్తె గురు జాహ్నవి హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేసింది. మొదటి నుంచి మంచి ఉత్తీర్ణత సాధిస్తున్న జాహ్నవి ఐఐటీ ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె మరింత ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ డివైడర్‌ను ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన కృష్ణమోహన్ పని నిమిత్తం బైక్‌పై గూడూరు వైపు వెళ్తుండగా కాకుటూరు సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలకు భరోసా కల్పించేలా..



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఆదాల, కాకాణి

- భవిష్యత్ కార్యాచరణపై కాకాణి, ఆదాల భేటీ

నెల్లూరు సిటీ : సర్వేపల్లి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, సానుభూతిపరులకు భరోసా కల్పించేలా చేపట్టే కార్యక్రమాలపై మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి చర్చించారు. నెల్లూరు నగరంలోని డైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఉన్న కాకాణి నివాసంలో ఈ మేరకు వారు ఆదివారం భేటీ అయ్యారు. ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులపై అధికార పార్టీ నేతలు చేస్తున్న హింసాత్మక దాడుల నేపథ్యంలో కార్యకర్తలకు అండగా ఉండేందుకు, భరోసా కల్పించేందుకు చేయాల్సిన కార్యాచరణపై చర్చించారు. తీవ్ర భయాందోళనకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు అన్నివిధాలా అండగా ఉండేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకుల సమష్టి సహకారంతో ముందుకు వెళ్లేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో ఈ సందర్భంగా చర్చించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులకు ఇబ్బంది కలిగినా, నష్టం వచ్చినా అన్నివిధాలా ఆదుకునేందుకు జిల్లా నాయకత్వం సిద్ధంగా ఉండేలా చేపట్టాల్సిన చర్యలపై భేటీలో చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు చెన్నారెడ్డి హరిచంద్రారెడ్డి, కొండా సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సీహెచ్ సూరిబాబు, ఆదిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (పొగతోట) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ రమణయ్య, కార్యదర్శిగా సురేంద్రబాబు, కోశాధికారిగా పి.ప్రమీలా, వైస్ ప్రెసిడెంట్లుగా సి.రామకృష్ణ, కె.సునీల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ సెక్రటరీలుగా కరుణాకర్, సత్యనాగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏసు, కార్తీక్ తదితరులు ఎన్నికయ్యారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, రాష్ట్ర నేత బి.సురేష్‌బాబు హాజరు కాగా ఎన్నికల అధికారిగా బ్రహ్మానందరెడ్డి వ్యవహరించారు. సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న స్టెనోగ్రాఫర్లు, టైపిస్టులు హాజరయ్యారు.

నిర్మించారు.. వదిలేశారు



2018లో నిర్మించి వదిలేసిన వ్యవసాయ శాఖ భవనం



1998లో నిర్మించి వదిలేసిన వ్యవసాయశాఖ భవనం

మండల వ్యవసాయశాఖకు గతంలో భవనాన్ని నిర్మించారు. తుది మెరుగులు అద్దకుండా కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోవడంతో అప్పటి నుంచి ఆ భవనం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంటోంది. దీనికి కొద్దిపాటి నిధులు వెచ్చించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

- కలగానే వ్యవసాయశాఖ కార్యాలయం

కొడవలూరు : మండల వ్యవసాయశాఖకు కార్యాలయం అత్యవసరం కావడంతో 2018లో రూ.10 లక్షల అంచనాతో టెండర్లు పిలిచారు. ఓ కాంట్రాక్టర్ రూ.7.50 లక్షలకే భవన నిర్మాణం చేస్తానని ముందుకు రావడంతో నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. వెంటనే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు గానీ, భవనంపై నీళ్ల ట్యాంక్ నిర్మాణం, ఫ్లోరింగ్, విద్యుత్ పనులు పూర్తి చేయకుండా నిధులు చాల్లేదన్న సాకు చూపి పత్తాలేకుండా పోయారు. పనులు పూర్తి కాకుండా కార్యాలయంలో విధులు నిర్వహించడం కష్టం కావడంతో దీనిని వ్యవసాయశాఖ స్వాధీనం చేసుకోలేదు. దీంతో అప్పటి నుంచి ఆ భవనం అలాగే ఉండిపోయింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

గత ఆరేళ్లుగా భవనాన్ని అలాగే వదిలేయడంతో కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా మొలిచిపోయాయి. రోడ్డు వెంబడి భవనం ఖాళీగా ఉండడంతో రాత్రిళ్లు మందుబాబులు తిష్ట వేస్తున్నారు. భవనం లోపల మందు బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లతో నిండిపోయింది. 2018లో చేపట్టిన నిర్మాణాన్ని ఇప్పటివరకు అలాగే వదిలేయడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది.

ఎన్నో ఇబ్బందులు

మండల వ్యవసాయశాఖకు సొంత కార్యాలయం కలగానే మిగిలింది. 1998వ సంవత్సరంలోనే వ్యవసాయశాఖకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని కార్యాలయానికి భవనాన్ని మంజూరు చేశారు. అదే ఏడాదిలో స్థానిక పీహెచ్‌సీ పక్కనే భవన నిర్మాణం ఆరంభించారు. ఆ భవన నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ కూడా కొంతమేర నిర్మించి సకాలంలో నిధులు మంజూరు చేయడం లేదన్న సాకు చూపి నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అప్పటి నుంచి ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ గదిలో వ్యవసాయశాఖ కార్యకలాపాలు కొనసాగుతూ వచ్చాయి. రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువుల పంపిణీ సమయంలో రైతులు ఎక్కువగా కార్యాలయానికి వస్తుంటారు. ఆ సమయంలో ఇరుకు గది కావడంతో రైతులు గంటల తరబడి నిలబడే వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని 2018లో కార్యాలయానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కార్యాలయ సిబ్బందికి, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా వ్యవసాయశాఖకు సొంత కార్యాలయం కలగానే మిగిలింది.

> **వినియోగంలోకి తెస్తేనే ప్రయోజనం**
>
> వ్యవసాయశాఖ కార్యాలయ భవనం నిర్మించి కేవలం కొద్దిపాటి పనులు మాత్రమే మిగిలి ఉండడంతో ఖాళీగా వదిలేసి ఉన్నారు. కొద్దిపాటి నిధులతోనే ఆ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవచ్చు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి నిధులు మంజూరు చేసి భవనాన్ని వినియోగంలోకి తెస్తే వ్యవసాయశాఖ కార్యాలయానికి పట్టిన గ్రహణం వీడుతుందని మండలంలోని రైతులు కోరుతున్నారు.

ఆర్వో ప్లాంట్లకు నిర్వహణ గ్రహణం



నక్కలమిట్ట కాలనీలో మూత పడిన ఆర్వో ప్లాంటు



గోవిందరెడ్డిపాళెంలో మూతపడిన ఆర్వో ప్లాంటు

- మేజర్ పంచాయతీలోనూ నిధులు నిల్

ముత్తుకూరు : పేదలకు కారుచౌకగా మినరల్ వాటర్ అందజేసే ఆర్వో ప్లాంట్ల నిర్వహణ పంచాయతీలకు పెను భారమైంది. ఫలితంగా పలు ఆర్వోప్లాంట్లు మూతపడ్డాయి. పరిశుభ్రమైన తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి కొనసాగుతోంది.

- ముత్తుకూరు మేజర్ పంచాయతీలోని నక్కలమిట్ట కాలనీలో ఆర్వో ప్లాంటు మూతపడింది.
- రిలయన్స్ కాలనీలోని ప్లాంటు కూడా పనిచేయక మూలనపడింది.
- దళితవాడలోని ప్లాంటులో పరికరాలు పాడైపోయి మూతపడడంతో తాగునీరు కొనుగోలు చేస్తున్నారు.
- నేలటూరు దళితవాడలో టాటా సంస్థ నిర్వహించే ఆర్వో ప్లాంటు మూతపడింది.
- గోవిందరెడ్డిపాళెం, పాట్టింపాడు గ్రామాల్లోని పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.
- మామిడిపూడి గ్రామంలోని వాటర్ ప్లాంటు తాగునీరు అందిస్తుంటే, దళితవాడలోని ప్లాంటు మూతపడింది.
- జెన్‌కో ప్రాజెక్టుకు చెందిన సీఎస్సార్ నిధులు జిల్లా కలెక్టర్ ఆధీనంలో ఉండడం వల్ల వీటి నిర్వహణ కష్టతరమవుతోంది.
- పామాయిల్ కంపెనీ, కృష్ణపట్నం పోర్టు నిర్వహించే ఆర్వో ప్లాంట్లు సమృద్ధిగా తాగునీరు అందిస్తున్నాయి.

> **పంచాయతీలో నిధుల కొరత**
>
> ముత్తుకూరు మేజర్ పంచాయతీలో పాడైపోయిన ఆర్వో ప్లాంట్లు బాగు చేయాలంటే నిధుల కొరత సమస్య అవరోధంగా ఉంది. సచివాలయం వద్ద ఉన్న ప్లాంటు మాత్రమే అందుబాటులో ఉంది.
>
> – శేషగిరి, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

మనుబోలు : మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు మనోజ్ కుమార్ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం కుంకుమ పూజ జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకుని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.





ఆలయంలో భక్తుల సందడి